


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 21-05-2026 సంపుటి : 07 సంచిక 349 పేజీలు : 8 వెల : రూ 3-00


## కువైట్‌లో చిక్కుకున్న చంద్రగిరి మహిళకు అండగా ఏపీ ప్రభుత్వం..



### సీఎం చంద్రబాబు ఆదేశాలు

తిరుపతి, మే 20 : కువైట్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ మహిళకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. చంద్రగిరి మండలం తొండవాడ గ్రామానికి చెందిన భాగ్యవతి ఉపాధి కోసం ఫిబ్రవరిలో కువైట్‌కు వెళ్లగా, అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఓ వీడియో విడుదల చేసింది. గృహ సహాయకురాలిగా పనిచేస్తున్న తనకు సంబంధిత ఏజెంట్లు సరైన ఉద్యోగ వీసా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేసింది. తాను శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నట్లు వీడియో ద్వారా తెలిపింది. స్వదేశానికి పంపాలంటే డబ్బులు చెల్లించాలని ఏజెంట్లు ఒత్తిడి చేస్తున్నారని పేర్కొంది. ఈ ఘటనపై వచ్చిన మీడియా కథనాలకు ముఖ్యమంత్రి కార్యాలయం వెంటనే స్పందించింది. బాధితురాలిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సీఎం సూచనలతో వెంటనే స్పందించిన ఏపీ ఎన్ఆర్టీఅధికారులు కువైట్‌లోని భారత రాయబార కార్యాలయంతో సంప్రదింపులు ప్రారంభించారు. భాగ్యవతి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ఆమెను త్వరితగతిన స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ ఘటనలో సంబంధిత ఏజెంట్ల పాత్రపై విచారణ జరపాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే న్యాయపరమైన చర్యలు కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇక తిరుపతి జిల్లా యంత్రాంగం బాధితురాలి కుటుంబ సభ్యులతో నిరంతరం సంప్రదింపుల్లో ఉంది. చంద్రగిరి పోలీసులు కూడా కుటుంబానికి భరోసా కల్పిస్తూ, భాగ్యవతి సురక్షితంగా తిరిగి వచ్చే వరకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన మరోసారి విదేశీ ఉద్యోగాల పేరుతో జరుగుతున్న మోసాలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. విదేశాలకు వెళ్లే ముందు అధికారిక అనుమతులు, వీసా వివరాలు పూర్తిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగంపై రఘురామ ఫైర్

పశ్చిమగోదావరి జిల్లా, మే 20 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దుర్వినియోగంపై ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై కొంతమంది ఇప్పటికే ఆరు తప్పుడు కేసులు పెట్టారని ఆరోపించారు. బుధవారం పశ్చిమగోదావరి జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'దొంగ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం మానేయాలి' అంటూ వ్యాఖ్యానించారు. పాస్టర్ అభినయ్ దర్శన్‌పై కూడా రఘురామ తీవ్ర విమర్శలు చేశారు. 'పాస్టర్ అభినయ్ దర్శన్ మంచి నటుడు. దర్శకత్వం కూడా ఆయనే చేయాలని అనుకున్నాడు. అన్ని వేషాలు ఒకేసారి వేయాలని ప్రయత్నించాడు' అంటూ ఎద్దేవా చేశారు. తాను రెచ్చగొట్టడం వల్లే దాడులు జరుగుతున్నాయని ప్రచారం చేశారని, అలాంటి ఆరోపణలు తనపై రాకుండా పోలీసులు వెంటనే చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు. మత ప్రచారం పేరుతో అనేక నాటకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాజోలులో సరెళ్ల విజయ్ ప్రసాద్ దళిత క్రైస్తవ శాంతి ర్యాలీ నిర్వహించారని ప్రస్తావించారు. క్రైస్తవ మతంలోకి మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని తెలిపారు.'ఘర్ వాపసీ ద్వారా తిరిగి హిందూ మతంలోకి రావడానికి అవకాశం ఉంది' అని రఘురామ వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేసినట్లు వెల్లడించారు. గుడి నిర్మాణం పూర్తి చేసే విషయంలో ఎలాంటి ఆలస్యం ఉండదని, చెత్త రాజకీయాలు చేయడం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. ఇవాళ కాకపోతే రేపు పాస్టర్ ఆనంద్ సర్టిఫికెట్ రద్దు అవుతుందని అన్నారు. సుప్రీంకోర్టులో తామే గెలుస్తామని.. నిజాలు బయటకు రావడం ఖాయమని రఘురామకృష్ణరాజు ధీమా వ్యక్తం చేశారు.



## మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం..

### కీలక విషయాలు వెల్లడించిన సోమిరెడ్డి..

అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి తీర్మానాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహా పలువురు సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న మహానాడు కావడంతో పార్టీ శ్రేణులకు ప్రతిష్టాత్మకంగా మారిందని అన్నారు. ఈ మేరకు రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడులో మొత్తం 19 తీర్మానాలు ప్రవేశపెట్టాలని తీర్మానాల కమిటీ నిర్ణయించిందని సోమిరెడ్డి తెలిపారు. వీటిలో అండమాన్‌కు సంబంధించి తొలిసారిగా ఒక తీర్మానం మహానాడులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే తెలంగాణ తీర్మానాలు రెండు, మిగతావి ఏపీకి సంబంధించి ఉంటాయన్నారు. ఈ సందర్భంగా వైసీపీపై పలు విమర్శలు గుప్పించారు సోమిరెడ్డి. రెండేళ్లుగా ఏపీలో పౌరులందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని.. వైసీపీ హయాంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. విధ్వంసానికి మారుపేరుగా గొడ్డలి పార్టీ మారిందని సోమిరెడ్డి మండిపడ్డారు.



రెండేళ్లుగా ఏపీ సాధించిన పెట్టుబడులు గతంలో ఎప్పుడూ రాలేదని కొనియాడారు. సీఎం చంద్రబాబు బ్రాండ్, లోకేశ్ కృషి, పవన్ తోడ్పాటు, కేంద్రం మద్దతుతో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు సాధించామని పేర్కొన్నారు. నెల్లూరులో మహానాడు నిర్వహించలేకపోయామనే బాధ ఉన్నప్పటికీ.. పొదుపు చర్యల కోసం హైబ్రిడ్ విధానం తప్పలేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

## దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

### నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి
### ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
### ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
### డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ సమావేశం

అమరావతి: దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం, అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నా. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనాపద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తామని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్ తో పోటీపడాలి. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటుచేశాం. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ నా లక్ష్యం, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి లోకేష్ దిశానిర్దేశం చేశారు.



## ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది: మంత్రి కొండపల్లి

అమరావతి, మే 20 : ప్రవాసాంధ్రుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఏపీ ఎన్ఆర్టీ భవన్‌లో మంత్రి కొండపల్లితో తెలంగాణ ప్రభుత్వ ఎన్నారై సలహా కమిటీ సమావేశమైంది. ఏపీలో అమలవుతున్న ఉత్తమ ఎన్నారై పద్ధతులు, సంక్షేమ కార్యక్రమాల అధ్యయనం కోసం ఏపీలో తెలంగాణ కమిటీ పర్యటిస్తోంది. గల్ఫ్ వలసదారులు, విదేశీ కార్మికుల సంక్షేమంపై ఏపీలో అమలవుతున్న పద్ధతులపై తెలంగాణ కమిటీ అధ్యయనం చేస్తోంది. క్షేత్రస్థాయిలో ప్రవాసాంధ్రులకు ఏపీ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అత్యవసర సహాయక చర్యలను తెలంగాణ బృందం పరిశీలించింది. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న వలస కార్మికుల సమస్యలు, నకిలీ ఏజెంట్లపై ఏపీ పోలీస్ ఎన్నారై సెల్ తీసుకుంటున్న చట్టపరమైన చర్యలపై చర్చించారు. గల్ఫ్ వలసదారుల భద్రత, బీమా సౌకర్యాలు, స్వదేశానికి తిరిగి వచ్చిన వారి కోసం అమలు చేస్తున్న పునరావాస పథకాలపై అధికారులను అడిగి తెలంగాణ సభ్యులు తెలుసుకున్నారు. ఏపీఎన్ఆర్టీ విధానాలపై అక్కడి ప్రభుత్వానికి తెలంగాణ ఎన్నారై సలహా కమిటీ సభ్యులు ఓ నివేదిక ఇవ్వనున్నారు. మంత్రి కొండపల్లితో జరిపిన చర్చల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ బీఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకుల భూపతి రెడ్డి పాల్గొన్నారు.





# సంపాదకీయం

గురువారం 21-05-2026

## మారుతోన్న బెంగాల్...

భారత సరిహద్దులో అత్యంత కీలకమైన చికెన్ నెక్ కేంద్రం చేతుల్లోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌ను ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేసే కీలకమైన 'చికెన్ నెక్' (సిలిగురి కారిడార్) ప్రాంతంపై కేంద్ర ఏజెన్సీల నియంత్రణ పెరిగే ముఖ్యమైన అభివృద్ధి చోటు చేసుకుంది. ఈ ప్రాంతంలోని సుమారు 120 ఎకరాల భూమి, జాతీయ రహదారి మార్గాలను బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీ ఎస్ ఎఫ్)కు అప్పగించాలని సువేందు అధికారి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో 22 కి.మీ. పొడవైన ఈ సంవేదనాత్మక ప్రాంతంపై కేంద్రం పట్టు మరింత బలపడనుంది. చికెన్ నెక్ అనేది భౌగోళికంగా చాలా సన్నటి, వ్యూహాత్మకంగా అత్యంత ముఖ్యమైన కారిడార్. ఇది పశ్చిమ బెంగాల్‌ను అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరం, త్రిపుర వంటి ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాంతం ఈశాన్య భారత అభివృద్ధికి 'జీవనాడి'లాంటిది. బంగ్లాదేశ్ సరిహద్దుతో పొరుగున ఉన్నందున, ఇక్కడ భద్రతా సవాళ్లు ఎక్కువ. సరిహద్దు అతిక్రమణలు, చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఇతర అనుచిత కార్యకలాపాలకు ఈ ప్రాంతం లక్ష్యంగా మారే అవకాశం ఉంది. తాజా నిర్ణయం ద్వారా భద్రతా దృక్పథం మార్చాలని అధికారులు భావిస్తున్నారు. స్థానిక అంతరాయాలు తగ్గి, భద్రతా బలగాలకు స్వేచ్ఛగా కదలికలు సాధ్యమవుతాయి. బంగ్లాదేశ్ నుంచి వచ్చే సంభావ్య బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చు. ఈ చర్య దేశ భద్రతా దృక్పథంలో భాగంగా చూడాలి. ఇటీవలి కాలంలో సరిహద్దు ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఇలాంటి నిర్ణయాలు అవసరమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారఅరాచకం నుంచి మొదలు పెడితే అన్యాయం వరకు.. అక్రమం నుంచి మొదలుపెడితే దుర్మార్గం వరకు.. దౌర్జన్యం నుంచి మొదలుపెడితే హింస వరకు.. ఇలా ఎన్ని పదాలుంటే అన్ని పదాలు.. వెస్ట్ బెంగాల్లో మమతా పరిపాలనకు సరిపోవు. గుండా రాజ్ దర్జాగా సాగింది. రక్తపాతం అడ్డు లేకుండా నడిచింది. 15 సంవత్సరాలు పాటు వెస్ట్ బెంగాల్ రావణకాష్టం లాగా రగిలిపోయింది. 15 సంవత్సరాలుగా అడ్డుకుంటూనే ఉంది.. జాతి ప్రయోజనాలు ఆమెకు అవసరం లేదు. దేశ ప్రయోజనాలు అవసరం లేదు. ఆమెకు కావాల్సింది ఓటు బ్యాంకు రాజకీయాలు. తన అధికారం కోసం.. ఆ అధికారాన్ని సుస్థిరం చేసుకోవడం కోసం ఏకంగా దేశ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టింది. చివరికి 15 సంవత్సరాల పాటు దేశ భద్రతతో ఆడుకుంది. చివరికి పాపం పండి ఓడిపోయింది. 15 సంవత్సరాల పరిపాలన కాలంలో వెస్ట్ బెంగాల్లో మమత బెనర్జీ సృష్టించిన అరాచకాలు మామూలువి కావు. చివరికి తన అధికారాన్ని పదిలం చేసుకోవడానికి బంగ్లాదేశ్ మంచి వచ్చిన వారికి ఓటు హక్కు.. ఆధార్ కార్డు వంటి సదుపాయాలు కల్పించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక మతం వారికి విపరీతమైన ప్రయారిటీ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో బెంగాల్ రాష్ట్రం పూర్తిగా అదుపు తప్పిపోయింది. కేంద్రం పాటు లేకుండా పోయింది. దేశ భద్రతపరంగా అత్యంత సున్నితమైన ఈ రాష్ట్రంలో అక్రమ చొర బాట్లు నిత్యం జరగడం మొదలుపెట్టాయి. చివరికి మమత ఆగడాలు తట్టుకోలేక అక్కడి ప్రజలు ఇటీవల ఎన్నికల్లో బిజెపికి అధికారాన్ని కట్టబెట్టారు. ఫలితంగా అక్కడ విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. బెంగాల్ రాష్ట్రంలో చికెన్ నెక్ రహదారి అత్యంత ముఖ్యమైనది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా వంటి దేశాలకు ఇది సరిహద్దుగా ఉంది. ఈ రహదారి పొడవు 122 కిలోమీటర్లు ఉంటుంది. 22 కిలోమీటర్ల వెడల్పు ఉంటుంది. దీని భద్రతను ఇకపై బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ చూసుకుంటుంది.. ఈ కారిడార్ చుట్టూ బిఎస్ఎఫ్ కంచె నిర్మిస్తుంది. దీనివల్ల సరిహద్దు దేశాల నుంచి చొరబాట్లు రాకుండా ఉంటాయి.. కేవలం చైనా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్ మాత్రమే కాకుండా.. మనదేశంలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచడంలో చికెన్ నెక్ రహదారి అత్యంత కీలకం.. ఈ రహదారికి సంబంధించిన 120 ఎకరాలను వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి సుబేందు అధికారి బిఎస్ఎఫ్ కు అప్పగించారు. 15 సంవత్సరాల పాటు ఇలా ఇవ్వకుండా మమతా బెనర్జీ కేంద్రాన్ని ఇబ్బంది పెట్టింది. సుబేందు మాత్రం కేవలం 15 నిమిషాల్లోనే దీనిని బిఎస్ఎఫ్ కు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కారిడార్ పరిధిలో ఉన్న ఏడు ప్రాంతాలలో రోడ్లను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అత్యంత ఆధునిక పద్ధతిలో నిర్మిస్తుంది. ఈ ప్రాంతంలో వర్షాలు పడటం వల్ల కొండ చరియలు విరిగిపడేవి. దీంతో ఈశాన్య రాష్ట్రాలకు రాకపోకలు అంతగా ఉండేవి కాదు. ఈ రహదారిని అప్పగించాలని కేంద్రం అనేక సందర్భాలలో విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. మమత ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. చివరికి ప్రజలకు ఆగ్రహం కలిగి. మమత పరిపాలనకు ఎండ్ కార్డు పడింది. అయితే ఇక్కడే ఆమె అక్రమ పరిపాలనకు సంబంధించిన ఒక్కొక్క అంశాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత బెంగాల్ రాష్ట్రంలో టిఎంసి కార్యాలయాలు మూతపడ్డాయి. మొన్నటిదాకా ఒక వెలుగు వెలిగిన ఆ కార్యాలయాలు ఇప్పుడు అమావాస్య చీకటిని తలపిస్తున్నాయి. ఇటీవల కోల్కతా నగరంలోని బిధాన్ నగర్ పరిధిలోని డివిజన్ కార్యాలయాన్ని తెరిచారు. అందులో కుప్పలుగా ఆధార్ కార్డులు బయటపడ్డాయి

## తుది దశకు చేరిన ధాన్యం సేకరణ ప్రక్రియ

**మరో వారం రోజుల్లో పూర్తి కానున్న కొనుగోళ్లు**

**వేసవి తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు**

**కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**

నిజామాబాద్, మే 20: జిల్లాలో యాసంగి?2026 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ తుది దశకు చేరిందని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. మరో వారం రోజుల్లోపు ధాన్యం సేకరణను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామని ఆమె వెల్లడించారు. ప్రభుత్వం తరపున ధాన్యం సేకరణ కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈసారి జిల్లాలో మొత్తం 739 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందని, సుమారు రూ.1,500 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా, రైతుల ఖాతాల్లో రూ.1,320 కోట్ల బిల్లులు జమ అయినట్లు వివరించారు.



ధాన్యం సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో ఇప్పటికే 430 కొనుగోలు కేంద్రాలను మూసివేసినట్లు తెలిపారు. ఇంకా మిగిలిన కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 40 వేల నుంచి 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, మరో వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా కొనుగోళ్లు పూర్తి అవుతాయని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో వరి కోతలు ఆలస్యంగా జరుగుతున్న కారణంగా ఇప్పుడిప్పుడే దిగుబడులు వస్తుండటంతో, అలాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లుల అన్‌లోడింగ్ పాయింట్ల వద్ద రైతులు, హమాలీల కోసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు, తాగునీటి సదుపాయం, ఓఆర్ఎస్ సాచెట్లు, మజ్జిగ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కొన్ని రైస్‌మిల్లుల వద్ద మధ్యాహ్న సమయంలో ఉచిత భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ధాన్యం సేకరణ చివరి దశలో రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలిస్తూ, రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా ట్యాబ్ ఎంట్రీలను వేగవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు అందుబాటులో ఉండటంతో పాటు, ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలను సమకూర్చినట్లు, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## 'మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలి'

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 20 : మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఏఐకేఎంఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బంది పెడుతుందని మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని, మార్కెట్‌లో దళారీలను కట్టడి చేయాలని, పండించిన పంటకు గిట్టుబాటు ధర చెల్లించాలని, రైతులకు పెండింగ్ లో ఉన్న డబ్బులను చెల్లించాలని కోరుతూ అఖిల భారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం-ఇల్లెందు ? పాల్వంచ క్రాస్ రోడ్‌లో సడక్ బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మొక్కజొన్న, వడ్లు తడిసి తీవ్రంగా రైతులు నష్టపోయారని, అలాగే మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం కూడా తడిసిపోతుందన్నారు. ధాన్యం రవాణాకు సరిపడా లారీలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, జిల్లాలో సరిపడా గోడాన్స్ ను అందుబాటులో ఉంచకపోవడం వల్ల రైతులు పంటలను నిల్వ చేసుకోలేకపోయారన్నారు. అలాగే ప్రభుత్వం సకాలంలో వరి ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయకపోవడం వల్ల వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యం అమ్ముకోవాల్సి వస్తుందని, 60 శాతంకు పైగా ధాన్యం తక్కువ రేటుకు వ్యాపారుల చేతుల్లోకి వెళ్తుందని దీని వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఈ సొమ్ము వ్యాపారులు, మార్కెట్ చైర్మన్, సొసైటీ చైర్మన్లులు ప్రభుత్వ అధికారులు, దళారులు పంచుకు తింటున్నారని ఆయన అన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వలన ఇంకా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని, ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు 15, 20 రోజుల్లో డబ్బులను ఖాతాలో జమ చేయాలని, యాప్ నమోదుపై అవగాహన లేని రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బట్టు ప్రసాదు, గూగులోత్ రామచంద్రు, కొమరం సత్యనారాయణ, మెస్ గోపాల్ పెద్దగోని ఆదిలక్ష్మి, మల్లోజు సుగుణ, రమేష్, కల్తి వెంకటేశ్వర్లు, ఉప్పరబోయిన రామ్మూర్తి, వెంకట్రాం, లిక్కి నరేష్ పాల్గొన్నారు.




## ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఇల్లెందులో సడక్ బంద్

**మొక్కజొన్న, వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్**

ఇల్లెందు, మే 20 : మొక్కజొన్న, వడ్లను యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని, దళారీలను కట్టడి చేయాలని, మద్దతు ధర చెల్లించాలని, కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు-కూలీ సంఘం (ఏఐకెఎమ్ఎస్) ఆధ్వర్యంలో బుధవారం ఇల్లెందు న్యూడెమోక్రసీ కార్యాలయం నుండి రైతులు, నాయకులు ప్రదర్శన నిర్వహించి కొత్త బస్టాండ్ సెంటర్‌లో సడక్ బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవునూరి మధు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవకతవకలపై గత నెల రోజులుగా రైతాంగం ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం సకాలంలో వరి ధాన్యం, మొక్కజొన్నలు కొనుగోలు చేయకపోవడం వల్ల కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించక పోవడం వల్ల వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అకాల వర్షాలతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు తక్షణమే పంటలు కొనుగోలు చేయాలని, దళారీలను అరికట్టాలని, కొనుగోలు చేసిన పంటకు డబ్బులు చెల్లించాలని, తడిసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో జరుగుతున్న దోపిడిని అరికట్టాలని, కళ్లాల్లో ఉన్న ధాన్యానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించడం వల్ల ఇల్లెందు సిఐ సురేష్ జోక్యం చేసుకుని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు తుపాకుల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొడుగు నరసింహారావు, సూర్ణపాక నాగేశ్వరరావు, పూనెం రంగయ్య, యదళ్లపల్లి సత్యం, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, పర్శిక రవి, మూడు మాలు, మోకాళ్ల కృష్ణ, జరుపుల కిషన్, భూక్యా మంగ్యా, వాంకుడోత్ మోతిలాల్, కల్తీ కోటమ్మ, నరాటి వెంకన్న, ఎల్. చిన్నస్వామి, గుర్రం యాదగిరి, సామెల్, గొగ్గెల రాజు, చింత నరసింహారావు, తేజావత్ లాలు, గూళ్ల సదయ్య, వాంకుడోత్ శ్రీను, తుడుం శ్రీను, బొమ్మెర్ల వీరన్న పాల్గొన్నారు.



## రైతు నష్టపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు : మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి



రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి నిలిపివేయడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా శంకరంపేట (ఎ) మండలంలోని జుక్కల్, వీరోజీపల్లి గ్రామాలలో ఐకేపీ వద్ద కొనుగోలు కేంద్రాలను మహారెడ్డి భూపాల్ రెడ్డి సందర్శించారు. అక్కడ రైతులు ఎదుర్కొంటున్నసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రోజులు గడుస్తున్నా వడ్లు కొనుగోలు కాకపోవడం, తూకాలు ఆలస్యం కావడం, సరిపడా సిబ్బంది లేక రైతులు గంటల తరబడి వేచి ఉండటంతో తాము తీవ్ర ఆందోళనలో ఉన్నామని రైతులు మహారెడ్డి భూపాల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఫోన్ చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులు తీసుకొచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి. రైతు నష్టపోతే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. రైతులకు ఎప్పుడూ మేము అండగా ఉంటామని అన్నారు.

## సమాచారం వచ్చిన వెంటనే నా కొడుకును అప్పజెప్పిన : కేంద్రమంత్రి బండి సంజయ్



పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ 9 రోజుల హైడ్రామా అనంతరం పోలీసుల ఎదుట ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. అయితే ఓ వైపు సాయి భగీరథ్‌ను మేమే అరెస్ట్ చేశామని పోలీసులు అంటుంటే.. మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని బండి సంజయ్ చెప్పుకొస్తుండటం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే ఈ కేసులో తనను తాను సమర్థించుకున్నట్టుగా బండి సంజయ్ చేసిన కామెంట్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మిమ్మల్ని అరెస్ట్ చేస్తారనే వార్త ప్రచారంలో ఉన్నది.. దానికేమంటరని ఓ రిపోర్టర్ బండి సంజయ్‌ను అడిగారు. దీనికి బండి సంజయ్ స్పందిస్తూ.. ఇది కోర్టు పరిధిలో ఉంది.. కోర్టులో కేసు నడుస్తున్నది. ఒక్కడి గుర్తు పెట్టుకోండి.. కన్న కొడుకును ఓ తండ్రి పోలీసులకు స్వయంగా అప్పగించినటువంటి సందర్భంగా ఏమైనా ఉందా..? కన్న కొడుకును నేను తీసుకుపోయి విచారణకు సహకరించాలని చెప్పి నాకు సమాచారం వచ్చిన వెంటనే నా కొడుకును అప్పజెప్పిన.. అంటూ కామెంట్ చేశారు. కాగా పోక్సో (ఖూఆూ) కేసులో బెయిల్ వస్తుందని 9 రోజుల దాకా కొడుకును దాచి, బెయిల్ రాకపోవడంతో బీఆర్ఎస్ ఆందోళన, ప్రజా సంఘాలు, విద్యార్థుల నుంచి వస్తున్న వ్యతిరేకత తట్టుకోలేక దిక్కు లేని స్థితిలో బండి సంజయ్ తన కొడుకును అప్పగించాడని అంతా చర్చించుకుంటున్నారు. ఖూఆూ కేసులో కొడుకుని 9 రోజులు దాచిన ఏకైక కేంద్ర మంత్రి కూడా తమరే అని ప్రజలు బాహాటంగానే మాట్లాడుతున్నారు.

## అర్ధరాత్రి యువకుల హల్ చల్..

**అత్తాపూర్ యువతి కిడ్నాప్ కేసు సుఖాంతం**

హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో అర్ధరాత్రి యువతి కిడ్నాప్ తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. అత్తాపూర్ కిడ్నాప్ కేసు సుఖాంతం అయింది. యువతిని పోలీసులు మలక్‌పేట్‌లో గుర్తించారు. ఫోన్ నంబర్ ఆధారంగా ట్రేస్ చేశారు. యువతి ఇంట్లోనే సురక్షితంగా ఉన్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి మహీంద్రా థార్ కారులో వచ్చిన నలుగురు యువకులు ఓ యువతిని బలవంతంగా ఎక్కించుకుని కిడ్నాప్ చేసే ప్రయత్నం చేశారని తెలిసిందే. ఈ క్రమంలో వారి నుంచి తప్పించుకున్న యువతి మొదట జాయ్ ఆస్పత్రిలోకి పరిగెత్తింది. కానీ లాభం లేకుండాపోయింది. యువకులు ఆస్పత్రి సిబ్బందిని బెదిరించి యువతిని కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. ఇది గమనించిన స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కారును అత్తాపూర్ నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు కారును చేజ్ చేశారు. కానీ నలుగురు యువకులు పోలీసుల కళ్లుగప్పి పారిపోయారు. నిందితులు ఉపయోగించిన కారుకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులకు వారిని పట్టుకోవడం సవాలుగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు చేజింగ్ సమయంలో కారు వెనుకాలే మరో బైక్ కూడా ఫాలో అయినట్లుగా గుర్తించారు. దర్యాప్తు కొనసాగించిన పోలీసులు ఎట్టకేలకు యువతి ఆచూకీ తెలుసుకోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



# వైసీసీలో కాపు నేతల యాక్టివ్

విజయవాడ, మే 20, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక వింత వాతావరణం కనిపిస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉండగా పదవులు, ఆర్థికంగా లాభ పొందిన వారిలో రెడ్డి సామాజిక వర్గం నేతలు అధికం. కానీ ఇప్పుడు ఆ పార్టీకి ఓటమి ఎదురైన తర్వాత పూర్తిగా సామాజిక వర్గం నేతలు సైలెంట్ అయ్యారు. జగన్ ఎంతవరకు కాపు నేతలతో రాజకీయం చేస్తున్నారు. తమ వారిని మాత్రం రక్షించుకునే పనిలో ఉన్నారు. ఈ రాజకీయం తెలియక వైసీపీలో కాపు నేతలు జగన్ చట్రంలో ఇరుక్కుపోతున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ప్రయోజనాలు రెడ్డి సామాజిక వర్గం నేతల వైతే.. కేసులతోపాటు వివాదాస్పద ముద్ర కాపు నేతలకు దక్కుతోంది. ఇది ఎంత మాత్రం కాపు నేతలు గ్రహించడం లేదు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో..వైసీపీ ప్రభుత్వంలో సకల శాఖామంత్రిగా ఉండేవారు సజ్జల రామకృష్ణారెడ్డి. రాజ్యసభ సభ్యుడితో పాటు టీటీడీ చైర్మన్ పదవి అనుభవించారు వైవి సుబ్బారెడ్డి. ఉత్తరాంధ్రకు సమన్వయకర్తగా ఉంటూ.. బాగానే వెనకేసుకున్నారు విజయసాయిరెడ్డి. అమరావతి పై విషం కక్కుతూ అడుగడుగునా అడ్డుకున్నారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. రాయలసీమను తన కనుసైగతో శాసించారు పుంగనూరు పెద్దిరెడ్డి. తాడిపత్రిలో సవాల్ చేస్తూ నిలిచారు కేతిరెడ్డి పెద్దారెడ్డి. గుడ్ మార్నింగ్ ధర్మవరం అంటూ హడావిడి చేసేవారు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. లిక్కర్ స్కాంతో ఎంతో కొంత వెనుకేసుకున్నారు పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి. ఇలా చెప్పుకుంటూ పోతే రెడ్డి సామాజిక వర్గమే సింహభాగం లబ్ధి పొందింది. అయితే ఇప్పుడు ఓటమి ఎదురు కావడంతో వారంతా సైలెంట్ అయ్యారు.రెడ్డి సామాజిక వర్గం వెళ్లిపోవడంతో కాపు సామాజిక వర్గంతో రాజకీయం చేస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇది గ్రహించక కాపు నేతలు రెచ్చిపోతున్నారు. అంబటి రాంబాబు, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్,బొత్స సత్యనారాయణ లాంటి వారితో రాజకీయాలు చేస్తున్నారు. మధ్యలో విడదల రజిని, జోగి రమేష్ లాంటి వారితో మాట్లాడిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలు చేయిస్తున్నారు. వీరు సైతం జగన్ ఎంత చెబితే అంతా అన్నట్టు వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అధికారాన్ని, పదవులను, ఆర్థిక ప్రయోజనాలను పంచుకున్న వారు మాత్రం ఇటువైపు చూడడం లేదు. అయితే ఇందులో జగన్ కుల ప్రయోజనం ఉంది. అది గ్రహించలేకపోతున్నారు వైసీపీలో ఉన్న కాపు నేతలు. తాము బాధితులుగా జగన్ చేతిలో మారిన వారు.. కాపులు అన్యాయానికి గురైపోతున్నారు అంటూ గగ్గోలు పెడుతున్నారు. ఇది ఎంత మాత్రం మంచిది కాదు.ఏపీలో తప్పకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని వైయస్సార్ కాంగ్రెస్



పార్టీ బలంగా భావిస్తోంది.. అయితే అది ఎలా? ఆ పార్టీకి తెలియాలి. ఎందుకంటే ఆ పార్టీ ప్రజా పోరాటాలు చేయడం లేదు. శాసనసభకు వెళ్లి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయడం లేదు. గట్టిగా ప్రశ్నించడం లేదు కూడా. పోనీ పార్టీ శ్రేణుల్లో ధైర్యం నింపుతున్నారా అంటే అదీ లేదు. నిన్న పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. కానీ చాలా నియోజకవర్గాల్లో అసలు ఈ ఆందోళన కార్యక్రమాలు కనిపించలేదు. పెద్ద పెద్ద నేతలు అంతా ముఖం చాటేసారు. అయినా సరే అధికారంలోకి వచ్చేస్తాం అన్న ప్రకటనలు మాత్రం విపరీతంగా వినిపిస్తున్నాయి. అసలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రస్థానం పరిశీలిస్తే 2014 నుంచి 2019 మధ్య ఓకే.. 2019లో అధికారంలోకి వచ్చాక 2024 ఎన్నికలను టార్గెట్ చేసుకొని సంక్షేమ పథకాలను విచ్చలవిడిగా అమలు చేసేసింది. అభివృద్ధిని వదిలేయడంతో ప్రజలు దానిని ఒక నిర్లక్ష్యంగా గుర్తించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఓడించారు. ప్రజలు ఎలా భావించి కూటమికి అధికారం కట్టబెట్టారో.. అదే మాదిరిగా పాలన సాగుతోంది.ఒకవైపు కూటమిపాలనను పరిశీలిద్దాం. అమరావతి రాజధాని నిర్మాణం జరుగుతోంది. దానిపై విషం చిమ్ముతుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికీ. ఇంకోవైపు పోలవరం నిర్మాణం జరుగుతోంది. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఉత్తరాంధ్ర ఐటీ హబ్ గా మారుతుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు రాయలసీమకు పెద్ద ఎత్తున వస్తున్నాయి. తయారీ రంగ పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. రాష్ట్రం లో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. అదే సమయంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకారుల వేటనిషేధ భృతి, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్.. ఇలా ప్రధాన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ప్రజల్లో సంతృప్తి శాతం కనిపిస్తోంది. గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోంది. ఇన్ని జరిగాక కూడా తాము అధికారంలోకి వచ్చేస్తాం అంటూ పగటి కలలు కంటోంది వైయస్సార్ కాంగ్రెస్.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లడం లేదు. ప్రజా సమస్యలను ప్రస్తావించే అవకాశం కోల్పోయారు. జగన్మోహన్ రెడ్డి ప్రజల మధ్యకు రావడం లేదు. వస్తేగిస్తే ఆ పార్టీ నేతల అరెస్టు సమయంలో పరామర్శలకు వస్తున్నారు. ప్రజా పోరాటాల్లో పాల్గొనడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు పై ఉన్న కోపంతో అమరావతిని పడకేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను అస్తవ్యస్తం చేశారు. అభివృద్ధి లేకుండా సంక్షేమ పథకాలతో మరోసారి అధికారంలోకి రావాలని భావించారు. అది మొన్నటి ఎన్నికల్లో వికటించిన ఆయన గుర్తించలేకపోయారు. ఇప్పటికీ అదే ధోరణితో ముందుకు వెళ్తున్నారు. అయినా అధికారం వచ్చేస్తుంది అంటూ ధీమాతో ఉన్నారు. అది ఎంత మాత్రం తగదు కూడా..

# రాజకీయాల్లోకి మౌనిక...



కర్నూలు మే 20, నంద్యాల రాజకీయ గడ్డపై మరో భూమా వారసురాలి గర్జన వినిపించబోతోంది. దివంగత భూమా నాగిరెడ్డి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని, ఇప్పటికే ప్రజాక్షేత్రంలో చురుగ్గా ఉంటున్న భూమా మౌనిక రెడ్డి నేరుగా ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు టాలీవుడ్ హీరో, ఆమె భర్త మంచు మనోజ్ స్పష్టం చేశారు. భూమా కుటుంబం నుంచి మరో కీలక నాయకురాలు అసెంబ్లీ బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. మంచు మనోజ్ భార్య భూమా మౌనిక రెడ్డి రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెలువడిన అధికారిక ప్రకటన ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఈ దంపతులు కలిసి ప్రారంభించిన ఐక్య ధైర్య సేన సమితి కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమని చెబుతూనే, మౌనిక రాజకీయ అరంగేట్రంపై మనోజ్ క్లారిటీ ఇచ్చారు. దీంతో భూమా నాగిరెడ్డి ఆశయ సాధన కోసం మౌనిక ప్రత్యక్ష రాజకీయాల్లో తనదైన ముద్ర వేయబోతున్నట్లు స్పష్టమవుతోంది. భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డిల ద్వితీయ కుమార్తె మౌనికకు రాజకీయాలు కొత్తేమీ కాదు. భూమా నాగిరెడ్డి మరణం తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తన సోదరి భూమా అఖిలప్రియ విజయం కోసం గర్భిణీగా ఉండి కూడా ఆమె చేసిన పాదయాత్ర, ప్రసంగాలు అప్పట్లో అందరినీ ఆకట్టుకున్నాయి. మౌనికలో ఉన్న వాగ్ధాటి, ప్రజలతో మమేకమయ్యే నైజం భూమా అనుచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి. కేవలం ఒక సెలబ్రిటీ భార్యగానే కాకుండా, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచే ధైర్యవంతురాలిగా ఆమెకు పాత నంద్యాల జిల్లాలో మంచి గుర్తింపు ఉంది. ప్రస్తుతం ఆళ్లగడ్డ నియోజకవర్గంలో భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే మౌనిక రెడ్డి మాత్రం కేవలం తన సోదరి వెనుక ఉండిపోయే పాత్రకు భిన్నంగా, సొంతంగా తన రాజకీయ భవితవ్యాన్ని నిర్మించుకోవాలని భావిస్తున్నారు. తన తండ్రికి కంచుకోట లాంటి నంద్యాల నియోజకవర్గం లేదా సమీప ప్రాంతాల్లో ఆమె పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకోవడానికి ఐక్య ధైర్య సేన ద్వారా ఆమె చేస్తున్న పర్యటనలు ఎన్నికల ముందు బలమైన పునాదిగా మారుతున్నాయి.మౌనిక పోటీ చేయడం ఖాయమని మనోజ్ ప్రకటించినప్పటికీ, ఏ పార్టీ నుంచి బరిలోకి దిగుతారనే విషయాన్ని మాత్రం సస్పెన్స్‌గా ఉంచారు. కుటుంబ గౌరవాన్ని కాపాడుతూ, ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చే ఏ పక్షం వైపు అయినా మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. భూమా మౌనిక రెడ్డి రాకతో నంద్యాల, ఆళ్లగడ్డ పాలిటిక్స్ మరింత ఆసక్తికరంగా మారబోతున్నాయి. సోదరి అఖిలప్రియతో కలిసి పని చేస్తారా లేక స్వతంత్రంగా తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుంటారా అన్నది వేచి చూడాలి.

# చిలకలూరిపేట రూరల్ పోలీసుల తనిఖీల్లో రూ. 45 లక్షల నగదు సీజ్

గుంటూరు,చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి తాతపూడి వద్ద ఎస్పీ గారి ఆదేశాల మేరకు పోలీసులు తెల్లవారుజామున 12:30 గంటల సమయంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో విజయవాడ నుండి చెన్నై వెళ్తున్న 'ఐరా బస్ ట్రావెల్స్' కు చెందిన బస్సులో ప్రయాణిస్తున్న హనీఫ్ మొహమ్మద్ హనీఫ్ అనే వ్యక్తి బ్యాగును సోదా చేయగా, ఎటువంటి పత్రాలు లేని సుమారు 45 లక్షల రూపాయల నగదు లభ్యమైంది

# విశాఖ తూర్పులో టీడీపీ మార్క్ మార్పు

విశాఖపట్టణం మే 20, విశాఖ జిల్లా ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళ పాటు ఎన్నికలు జరిగాక వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అతి కొద్ది మంది నేతలలో ఆయన కూడా ఒకరుగా ఉన్నారు.విశాఖ తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటు అయిన దగ్గర నుంచి వరసబెట్టి టీడీపీ గెలుస్తూ వస్తోంది. ఇప్పటికి నాలుగు సార్లు ఎన్నికలు జరిగితే అన్ని సార్లూ టీడీపీ తరఫున గెలిచిన ఏకైక ఎమ్మెల్యేగా వెలగపూడి రామక్రిష్ణబాబు ఉన్నారు. ఆయన ఈసారితో ఏకంగా 20 ఏళ్ళ పాటు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని పాలించిన నేతగా రికార్డు క్రియేట్ చేస్తున్నారు. విశాఖ జిల్లా ఏర్పడిన తరువాత స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళ పాటు ఎన్నికలు జరిగాక వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అతి కొద్ది మంది నేతలలో ఆయన కూడా ఒకరుగా ఉన్నారు. అయితే ఆయనకు సామాజిక సమీకరణల కారణంగా మంత్రి పదవి అయితే దక్కలేదు. మరో వైపు చూస్తే ఆయన తన వారసుడిని వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉంచారు. ఇదిలా ఉంటే ఈ మధ్య జరిగిన జిల్లా పార్టీ ఎమ్మెల్యేల సమీక్షా సమావేశంలో అధినేత చంద్రబాబు తూర్పు నియోజకవర్గాన్ని ఉద్దేశించి కొన్ని కీలకమైన కామెంట్స్ చేశారు. అవి ఇపుడు పార్టీలోనూ రాజకీయంగానూ చర్చగా ఉన్నాయని అంటున్నారు. వెలగపూడికి ఓపిక తగ్గింది అంటూ అధినాయకత్వం కామెంట్స్ చేసింది అని ప్రచారం సాగుతోంది. దాంతో పాటుగా తూర్పులో బలంగా ఉన్న సామాజిక వర్గం యాదవులను కూడా కలుపుకుని పోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. దాంతో తూర్పు మీద హైకమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టిందని అర్థం అవుతోంది అని అంటున్నారు. ఈ మధ్య టీడీపీ రాష్ట్ర జాతీయ కమిటీల నియామకంలో తూర్పు నియోజకవర్గం నుంచి వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కి కీలక పదవి దక్కింది. అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న సీనియర్ నేత వెలగపూడికి అయితే ఏ పదవీ ఇవ్వలేదు. ఆయన వారసుడు కుమారుడు అయిన యువ నేతకు కూడా స్థానం కల్పించలేదు. దాంతో తూర్పు లో మార్పు ఖాయమా



అన్న చర్చ పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక ప్రణవ్ గోపాల్ అయితే మంత్రి నారా లోకేష్ టీం లో ఉన్నారని అంటున్నారు. అందుకే ఆయనకు ఎంతో ప్రతిష్టాత్మకమైన వీఎంఆర్డీఏ చైర్మన్ పదవిని కట్టబెట్టడమే కాకుండా మరోసారి కూడా పొడిగించి కొనసాగిస్తున్నారు అని గుర్తు చేస్తున్నారు. ఇపుడు పార్టీలో కూడా కీలకం చేస్తున్నారు అంటే వచ్చే ఎన్నికల్లో తూర్పు అసెంబ్లీ నుంచి ఆయనని పోటీ చేయిస్తారా అన్న చర్చ సాగుతోంది.మరో వైపు తూర్పులో అత్యధిక శాతం బీసీలు ఉన్నారు. వారంతా తమకు ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరుతున్నారు. యాదవ సామాజిక వర్గం అయితే గాజువాకతో పాటు తూర్పు కూడా ఇవ్వాలని అపుడే సమ న్యాయం అవుతుందని వాదిస్తోంది. దాంతోనే యాదవులను కూడా కలుపుకుని పోవాలని హైకమాండ్ సూచించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఒకవేళ సామాజిక సమీకరణలను పరిగణనలోకి తీసుకుంటే యాదవుల నుంచి కూడా సమర్థులైన నాయకులు టీడీపీకి ఉన్నారని గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద చూస్తే 2029 లో సీట్లు కనుక పెరగకపోతే మాత్రం టీడీపీలో భారీ మార్పు ఉంటుందని అంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి హవా సాగుతున్నప్పటికీ పార్టీదే అంతిమ నిర్ణయం కాబట్టి ఏమి జరుగుతుందో చూడాల్సి ఉందని అంటున్నారు.

# మిత్రపక్షాల మధ్య సీట్ల లెక్కలు

విజయవాడ, మే 20 వచ్చే నెల జరగనున్న నాలుగు రాజ్యసభ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో అమితాసక్తిని రేకెత్తిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన తెలుగుదేశం–జనసేన–బీజేపీ కూటమికి అసెంబ్లీలో ఉన్న తిరుగులేని బలంతో, ఈ నాలుగు స్థానాలూ ఏకగ్రీవంగా కూటమి ఖాతాలోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అందుకే అభ్యర్థుల ఎంపిక, మిత్రపక్షాల మధ్య సీట్ల పంపకాలపై ఇప్పుడు చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యులు?ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, మరియు పరిమల్ నత్వానీల పదవీ కాలం జూన్ 21, 2026తో ముగియనుంది. ఖాళీ అవుతున్న ఈ నాలుగు స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయనుంది. అసెంబ్లీలో కూటమికి ఉన్న సుమారు 164 మంది ఎమ్మెల్యేల బలంతో, ఒక్కో స్థానానికి అవసరమైన కోటా ఓట్లు సులభంగా లభిస్తాయి. దీంతో విపక్ష వైఎస్సార్‌సీపీకి ఈ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కూడా లేని పరిస్థితి నెలకొంది.ఈ నాలుగు స్థానాల్లో సీట్ల పంపకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అగ్రనాయకత్వం మధ్య ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిగినట్లు సమాచారం. అందుతున్న సంకేతాల ప్రకారం.. నాలుగు స్థానాల్లో రెండు స్థానాలను తెలుగుదేశం పార్టీ తన వద్దే ఉంచుకుని, ఒకటి జనసేన కు, మరొకటి బీజేపీ కి కేటాయించే అవకాశం ఉంది. జాతీయ రాజకీయాల్లో బీజేపీకి మద్దతుగా ఉండటంతో పాటు, రాష్ట్రంలో జనసేన త్యాగాలను గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.బీజేపీకి కేటాయించే ఒక స్థానంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. తమిళనాడులో పార్టీని బలోపేతం చేసేందుకు, ఫైర్ బ్రాండ్ నేత కె. అన్నామలై ని ఏపీ నుంచి రాజ్యసభకు పంపాలని బీజేపీ హైకమాండ్ యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను పార్లమెంటుకు పంపడం ద్వారా 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి మైలేజీ వస్తుందని ఢిల్లీ పెద్దల వ్యూహం. ఒకవేళ అన్నామలై కాకపోతే, రాష్ట్రానికి చెందిన కీలక నేత లేదా కేంద్ర మంత్రివర్గంలో ఉన్న ఎవరైనా ఒకరికి ఈ అవకాశం దక్కవచ్చు.జనసేన పార్టీకి దక్కే ఒక సీటు కోసం పార్టీలో గట్టి పోటీ నెలకొంది. పవన్ కళ్యాణ్‌కు అత్యంత సన్నిహితులు లింగమనేని రమేష్ పేరు వినిపిస్తోంది.

# ఎమ్మెల్యే నుంచి కేంద్రమంత్రి పదవికి.....

విజయవాడ, మే 20,విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి పాతుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన తన వ్యాపారాల్లో తలమునకలై ఉన్నప్పటికీ తన కార్యాలయంలో ఎప్పుడూ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నారు. వారంలో రెండు రోజుల పాటు విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీలో టిక్కెట్లను ఇప్పించిన వ్యక్తి బీజేపీలో చేరి ఎమ్మెల్యే అయ్యారు. గత ఎన్నికల్లో విజయవాడ పార్లమెంటు స్థానాన్ని సుజనా చౌదరి ఆశించారు. కానీ తెలుగుదేశం పార్టీకి పొత్తులో భాగంగా వెళ్లింది. మరొకస్థానమయినా కేటాయిస్తారనుకున్నారు. కానీ చివరకు బీజేపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సుజనా చౌదరిని పరిమితం చేసింది. సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గానికే పరిమితమయినా ఏ మాత్రం ఇబ్బంది పడకుండా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు.టీడీపీలో ఉన్న సమయంలో రాజ్యసభ సభ్యుడిగానూ, కేంద్ర మంత్రిగానూ పనిచేసిన సుజనా చౌదరి ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా సర్దుకుపోతున్నారు. భవిష్యత్ తనకు అనుకూలంగా మారుతుందని లెక్కలు వేస్తున్నారు. ఎలాంటి వివాదాల జోలికి పోవడం లేదు. రాష్ట్రంలో జరిగే రాజకీయ పరిణామాల పట్ల కూడా ఆయన వ్యాఖ్యానించడం లేదు. ఇటు టీడీపీకి అనుకూలంగా కానీ, అటు వైసీపీకి వ్యతిరేకంగా గాని ఎలాంటి ప్రకటనలు చేయకుండా సుజనా చౌదరి కొత్త పాలిటిక్స్ ను మొదలుపెట్టారంటున్నారు. బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గంలో తనకు చోటు దక్కుతుందని భావించినప్పటికీ అది దక్కలేదు. కానీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గాన్ని మాత్రం వదలకుండా పట్టుకుని తిరుగుతున్నారురాజకీయాల్లో వేగంగా, ఆవేశంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని సుజనా చౌదరికి తెలుసు. అందుకే సమయం కోసం వెయిట్ చేస్తున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో తొలిసారి బీజేపీ గెలిచింది. టీడీపీ ఎప్పుడూ ఇక్కడ గెలవలేదు. టీడీపీ అస్సలు గెలవని చోట విజయం సాధించిన సుజనా చౌదరి ఈసారి విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారా? లేక విజయవాడ పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారా? అన్న చర్చ కూడా జరుగుతుంది. కృష్ణా జిల్లాకు చెందిన సుజనా చౌదరికి టీడీపీలోని అన్ని నియోజకవర్గాల నేతలతో ఇప్పటికీ సత్సంబంధాలున్నాయి. పొత్తులో భాగంగా ఈసారి విజయవాడ పార్లమెంటు స్థానాన్ని తీసుకుంటే తాను కేంద్ర రాజకీయాల్లోకి వెళ్లవచ్చని సుజనా చౌదరి ఆలోచనలో ఉన్నారట. అందుకే సమయం కోసం సుజనా వెయిట్ చేస్తున్నారంటున్నారు. మరి చివరకు ఏం జరుగుతుందన్నది చూడాలి.

# చింతకాయల విజయ్ కు బిగ్ టెస్ట్..!

శ్రీకాకుళం, మే 20, ఒకవైపు రాజ్యసభ సీటు వరిస్తోంది. మరోవైపు వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలన్న ఆశలు కూడా రేకెత్తుతున్నాయి. ఈ క్రమంలో యువ నాయకుడు.. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్య న్నపాత్రుడు తనయుడు విజయ్ ఏ నిర్ణయం తీసుకోవాలని విషయంపై తర్జనభర్జనలు పడుతున్నట్టు తెలుగుదేశంలో టాక్ బలంగా వినిపిస్తోంది. గత కొన్నా ళ్లుగా ఆయనకు రాజ్యసభ స్థానం దక్కుతుందన్న ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి గత ఎన్నికల్లోనే అనకాపల్లి నుంచి పార్లమెంటుకు పోటీ చేయాలని అనుకున్నారు.. పొత్తులో కుదరకపోవడంతో నర్సీపట్నం నుంచి అసెంబ్లీకి అయినా పోటీ చేద్దాం అనుకున్నారు. రాజకీయ వాతావరణ నేపథ్యంలో అప్పట్లో సీఎం చంద్రబాబు చింతకాయల అయ్యన్నపాత్రుడు వైపే మొగ్గుచూపారు. దీంతో విజయ్‌కు అవకాశం రాలేదు. అయితే, పార్టీలో యాక్టివ్ గా ఉండడంతోపాటు యువ నాయకుడిగా ముఖ్యంగా లోకేష్ బృందంలో కూడా విజయ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయనను రాజ్యసభకు పంపిస్తారని పెద్ద ఎత్తున ప్రచారం అయితే జరిగింది. ప్రస్తుతం కూడా అదే ప్రచారం జరుగుతోంది. త్వరలోనే నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానున్నాయి. రెండు స్థానాలను టిడిపి తన అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. దీంతో ఒకటి అయ్యన్నపాత్రుడు తనయుడికి ఇస్తారన్న ప్రచారం జరుగుతోంది. కానీ, మరోవైపు వచ్చే ఎన్నికల్లో విజయ్ నర్సీపట్నం నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని కూడా అంటున్నారు. మరి ఈ రెండిట్లో ఏది తీసుకుంటారు.. వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉంటారా.. లేకపోతే రాజ్యసభకు వెళ్తారా అనేదానిపై పార్టీలో గట్టిగా చర్చ మొదలైంది. విజయ్ రాజ్యసభకు కాకుండా వచ్చే ఎన్నికలకు ప్రిపేర్ చేసే వ్యూహం ఉందని పార్టీ సీనియర్ వర్గాలు చెబుతున్నాయి. యువ నాయకుడు, ఉత్సాహవంతుడు రాజ్యసభకు వెళ్లడం కన్నా వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయడం ద్వారా మేలు జరుగుతుందని మెజారిటీ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇదే విషయంపై పార్టీ అధినేత కూడా సిద్ధంగా ఉన్నారని అంటున్నారు. మొత్తంగా ఈ వ్యవహారం ప్రస్తుతం టిడిపిలోనూ రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిగా మారింది. అయితే ఇంత జరుగుతున్నా అయ్యన్నపాత్రుడు మాత్రం మౌనంగా ఉన్నారు. ఏం జరిగితే అదే జరుగుతుంది అన్నట్టుగా ఆయన చూస్తూ మౌనంగా పాటిస్తున్నారు. మరి వాస్తవానికి విజయ్ అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేయడమే మంచిది అన్న అభిప్రాయం స్థానికంగా వినిపిస్తుండడం గమనార్హం.

# జీడి నెల్లూరు టీటీడీ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సంచలన వాఖ్యలు

నెల్లూరు,కూటమి ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా ఇసుక,గ్రావెల్ అక్రమ రవాణా అవుతోందని జీడి నెల్లూరు టీటీడీ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అంగీకరించారు. చంద్రగిరి, నగరి నియోజక వర్గాల్లో అక్రమ రవాణా గురించి పట్టించుకోవడం లేదు. దళిత ఎమ్మెల్యే లు నియోజకవర్గాల్లో జరుగుతున్నది మాత్రమే చూపిస్తున్నారని అయన అన్నారు.

# మహిళా పీఎస్ పై పెట్రోల్ బాటిల్ తో దాడి.

విజయనగరం,విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్ పై మంగళవారం రాత్రి షేక్ గౌస్ అనే వ్యక్తి పెట్రోల్ బాటిల్ తో దాడి చేశాడు. సాలూరు కు చెందిన గౌస్ విజయనగరం కు చెందిన మహిళను నాలుగేళ్ళ క్రితం వివాహమాడాడు. ఇద్దరు పిల్లలున్న గౌస్ కుటుంబం లో కలహాలు రావడంతో మహిళా స్టార్ సిబ్బంది గౌస్ భార్య ను స్టేషన్ కు పిలిచించారు. ఆ రాత్రే గౌస్ సరాసరి మహిళా పోలీస్ స్టేషన్ కు వచ్చి రావడంతోనే ఒక బాటిల్ తి పెట్రోల్ తీసుకుని ఆ పై మద్యం సేవించి స్టేషన్ పై దాడి చేశాడు. స్టేషన్ లో రిసెప్షన్ వద్ద, ఎస్ఐ రూమ్ గోడపై పెట్రోల్ పోసి నిప్పంటించబోతుండగా స్టేషన్ సిబ్బంది అడ్డుకున్నారు.

## డివైడర్లు పరిశుభ్రంగా ఉంచాలి-- : కమిషనర్ బి శేషన్న



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20-నంద్యాల పట్టణంలో రహదారి డివైడర్లు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రధాన రహదారుల వద్ద ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిన ఆయన, డివైడర్లలో పెరిగిన పొదలు, చెత్తను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం మున్సిపాలిటీ బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రత పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్వైజర్లు లక్ష్మీనారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సున్నిపెంటకు రూ.10 కోట్లు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20:- సున్నిపెంట భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. మంగళవారం సున్నిపెంటలో రూ. 10 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సున్నిపెంటలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, త్వరలో ఇంటింటికీ తాగునీరు అందించే చర్యలు చేపడతామని తెలిపారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు నంద్యాలలో ఘన స్వాగతం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20:బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా నంద్యాలకు విచ్చేయగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు . జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు కలిసి పూలమాలలు వేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నంద్యాలలో బీజేపీ కార్యకర్తల్లో భారీ ఉత్సాహం నెలకొంది. పార్టీ జెండాలతో, నినాదాలతో నాయకులు మాధవ్‌కు స్వాగతం పలికారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పీవీఎన్ మాధవ్ సూచించినట్లు నాయకులు తెలిపారు. జిల్లాలో పార్టీ కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేపట్టి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, మహిళా నాయకులు, యువమోర్చా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## స్టాప్-వాష్ అండ్ గో తనిఖీలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల భద్రత లక్ష్యంగా ప్రతిరోజూ "స్టాప్-వాష్ అండ్ గో" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు రాత్రి వేళల్లో ప్రధాన రహదారులు, హైవేలపై ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు .ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీ, ట్రావెల్స్ బస్సులను ఆపి డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహన పత్రాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్నారు. డ్రైవర్లు అతివేగం, రాంగ్‌రూట్ ప్రయాణం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



# భానుడు భగ్గుమంటున్నాడు--

## అప్రమత్తంగా ఉండండి కలెక్టర్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20 :- జిల్లాలో రానున్న వారం రోజుల పాటు తీవ్ర వడగాల్పులు నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. మధ్యాహ్న వేళల్లో బయటకు రావద్దని, అత్యవసరమైతే ఉదయం 9 గంటల లోపు లేదా సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే పనులు చూసుకోవాలని తెలిపారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, పలుచటి పత్తి దుస్తులు వినియోగించాలని పేర్కొన్నారు. పంచాయతీలు, మున్సిపాలిటీలు, ఉపాధి హామీ పనుల్లో పనిచేసే కార్మికులకు తాగునీరు, నీడ, విశ్రాంతి సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామ, వార్డు సచివాలయాలు, సోషల్ మీడియా, కేబుల్ నెట్‌వర్క్‌లను వినియోగించాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎండ తీవ్రత వల్ల ఎటువంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.



# బక్రీద్‌కు పోలీసుల ముందస్తు కసరత్తు--

## ఆళ్లగడ్డలో శాంతి కమిటీ సమావేశం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , 20 మే 2026:రాబోయే బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆళ్లగడ్డ పోలీస్ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ టౌన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆళ్లగడ్డ ఎస్‌డీపీఓ, టౌన్ సీఐ అధ్యక్షత వహించగా, పట్టణానికి చెందిన వివిధ వర్గాల కమ్యూనిటీ పెద్దలు, మత పెద్దలు, గౌరవ ప్రముఖులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సమావేశంలో చర్చించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని మత పెద్దలు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎవరికీ ఇబ్బంది కలగకుండా పండుగను నిర్వహించాలని అధికారులు ప్రజలకు సూచించారు. పండుగ సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# నిర్మాణాలు పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను సొసైటీ లకు అప్పగించాలి

## నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న ఎంపీఎఫ్‌సీ లను త్వరితగతిన పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




కర్నూలు, మే 20:- నిర్మాణాలు పూర్తయిన మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్లను సొసైటీ లకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు..బుధవారం కలెక్టరేట్ లో మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ కు సంబంధించిన జిల్లా స్థాయి ఇంప్లిమెంటేషన్ కమిటీ (డీఎల్ఐసీ) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్న 23 ఎంపీఎఫ్‌సీ లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్కెటింగ్ ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు... 50 గోదాముల నిర్మాణాలు పూర్తయినప్పటికీ కేవలం 5 మాత్రమే సొసైటీ లకు స్వాధీనం చేశారని, త్వరితగతిన మిగిలిన సెంటర్లను కూడా హ్యాండోవర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారిని ఆదేశించారు..సమావేశంలో డిసిఓ శిరీష, కే డి సి సి బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వర రెడ్డి, ఏపీ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ రంగనాథ్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజాకృష్ణ రెడ్డి, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు..

## మంత్రి మధుకర్ జీకి ఘన స్వాగతానికి బీజేపీ శ్రేణులు సిద్ధం--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , మే 20:రాష్ట్ర పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి మధుకర్ జీ బుధవారం రాత్రి 10 గంటలకు నంద్యాలకు రానున్న నేపథ్యంలో బీజేపీ శ్రేణులు ఘన స్వాగతానికి సిద్ధం కావాలని నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు అభిరుచి మదు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువ మోర్చా, మహిళా మోర్చా, అనుబంధ విభాగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మధుకర్ జీ పర్యటనతో జిల్లాలో పార్టీకి మరింత ఉత్సాహం పెరుగుతుందని, బీజేపీ బలోపేతానికి ఇది కీలకంగా మారుతుందని అభిరుచి మదు పేర్కొన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న ప్రతి కార్యకర్త తప్పకుండా పాల్గొని ఐక్యతను చాటాలని ఆయన సూచించారు. మంత్రి రాక సందర్భంగా నంద్యాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## ఆర్జీఎంలో మహిళల భద్రతపై అవగాహన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20 - పాణ్యం మండలం ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో "మహిళల సంరక్షణ మా బాధ్యత" అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునీల్ షెరాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థినులు శక్తి యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అత్యవసర సమయంలో 112 నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే 1930 సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అదనపు ఎస్పీ జావళి ఆల్ఫోన్స్ మాట్లాడుతూ మహిళలు ఉన్నత విద్యతో ఆర్థికంగా ఎదిగితేనే నిజమైన సాధికారత సాధ్యమవుతుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జయరాములు సైబర్ మోసాలపై అవగాహన కల్పించగా, పాణ్యం ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పోలీస్ సహాయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల తనిఖీ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 20: నంద్యాల మండలంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్స్, అనుమతి పత్రాలు పరిశీలించి, 10 రకాల ప్రత్తి విత్తనాల నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. అనంతరం నిర్వహించిన హెచ్‌టీఈ పరీక్షల్లో విత్తనాలు నెగిటివ్‌గా నిర్ధారణయ్యాయని తెలిపారు. ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలనే రైతులకు విక్రయించాలని, ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు చేయరాదని దుకాణదారులకు సూచించారు. విత్తన చట్టం?1966, విత్తన నియంత్రణ క్రమం?1983 నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**